

మల్కాపూర్ శివారులోని గుట్ట నుంచి మొరం తరలిస్తున్న టిప్పర్లు

- మల్కాపూర్, సారంగపూర్‌లోనూ.. రెచ్చిపోతున్న మాఫియా
- చోద్యం చూస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

మొరం అక్రమార్కుల పరం

# గుట్టలు మాయం

డిచ్‌పల్లి, ఆగస్టు 3: పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు.. సహజమైన ప్రకృతి అందాలతో అలరారుతున్న పల్లెల్లో మొరం దందా జోరుగా సాగుతున్నది. కొందరు అక్రమార్కుల దురాశ కారణంగా పెద్ద పెద్ద గుట్టలు మాయమవుతున్నాయి. కండ్ల ముందే కొండలు కరిగి పోతున్నాయి. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని గుండారం, మల్కాపూర్ (ఏ), సారంగపూర్ తదితర గ్రామాల్లో విచ్చలవిడిగా మొరం తవ్వకాలు సాగుతున్నాయి. సహజ సంపదను కాపాడాల్సిన అధికారుల కనుసన్నల్లోనే మొరం మాఫియా రెచ్చిపోతున్నది. రాత్రీపగలూ తేడా లేకుండా గుట్టలను కొల్లగొడుతున్నది. పర్మిట్ల పేరుతో ఒక వే బిల్లు తీసుకుని వందల టిప్పర్లలో మొరం తరలించుకుపోతున్నారు. మల్కాపూర్‌లో 20 ట్రిప్పులకు అనుమతిస్తే ఏకంగా 200 ట్రిప్పుల మొరం తరలించుకుపోవడం గమనార్హం.

**నేతలు, అధికారుల కనుసన్నల్లోనే..**

అధికార పార్టీ నేతల అండదండలతోనే యథేచ్ఛగా మొరం దందా కొనసాగిస్తున్నారని ఆ యా గ్రామాల ప్రజలు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పై స్థాయి నాయకుల ఆదేశాల మేరకు అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా యథేచ్ఛగా నడుస్తున్నదన్న ప్రచారం జరుగుతున్నది. నిత్యం 20-30 టిప్పర్లు తిరుగుతుండడంతో దుమ్మూధూళితో ఇబ్బందులు పడుతున్నామని, రోడ్లు కూడా ధ్వంసమవుతున్నాయని మల్కాపూర్(ఏ) గుండారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

మల్కాపూర్, గుండారం, సారంగాపూర్ గ్రామాల్లో అక్రమంగా మొరం దందా కొనసాగుతున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్ (ఏ)లో అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని వీడీసీ సభ్యులు జూన్ 18వ తేదీన కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 20 ట్రిప్పులకు అనుమతి తీసుకుని 200 ట్రిప్పులు తరలించుకు పోతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయినప్పటికీ ఈ అక్రమ దందాపై చర్యలు తీసుకోక పోవడం గమనార్హం.

## మాక్లూర్‌లో మాయమవుతున్న గుట్టలు

మాక్లూర్, ఆగస్టు 3: మాక్లూర్ మండలంలో మొరం అక్రమ తవ్వకాల వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా నడుస్తున్నది. అనుమతి లేకుండా రాత్రివేళలో జిల్లా కేంద్రానికి మొరం తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మాదాపూర్, మాక్లూర్, చిన్నాపూర్, సింగంపల్లి, దాస్‌నగర్, మామిడిపల్లి తదితర గ్రామాల్లో మొరం మాఫియా ఆగడాలకు అంతేలేదు. దీంతో గుట్టలు మాయమై పచ్చని ప్రకృతి కళావిహీనంగా మారుతున్నది. మాదాపూర్‌లోని తహసీల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ తతంగమంతా నడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా జరిమానా విధిస్తూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమ మొరం తరలింపుపై తహసీల్దార్ షబ్బీర్‌ను వివరణ కోరగా అనుమతులు లేకుండా మొరం తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని, ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిని ఉపేక్షించేది లేదన్నారు.


సింగంపల్లి-చిన్నాపూర్ శివారులో మొరం తీస్తున్న పొక్లెయిన్

### మొరం తవ్వకాలకు అనుమతులు లేవు



రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామం నుంచి మొరం అక్రమ తవ్వకాలకు మేము అనుమతులు ఇవ్వలేదు. రెండునెలల క్రితం 20 టిప్పర్లకు మాత్రమే వే బిల్లులు ఇచ్చాం. అవి పూర్తయిన తర్వాత మళ్లీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. మొరం అక్రమ తవ్వకాలు జరుగుతున్న విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై ఫిర్యాదు వస్తే తప్పకుండా చర్యలు తీసుకొని, వాహనాలను సీజ్ చేస్తాం. మండలంలో ఎక్కడైనా మొరం అక్రమ తవ్వకాలు జరిపితే ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు.

**-అనురుధ్, రూరల్ తహసీల్దార్**



## కారం మెతుకులే..

కోటగిరి, ఆగస్టు 3: విద్యావ్యవస్థను పటిష్టం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ఓవైపు గొప్పలు చెబుతుంటే, క్షేత్ర స్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు చెల్లించక పోవడం మూలంగా విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. కారం మెతుకులతో కడుపు నింపుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం కొత్తపల్లి పాఠశాలలో చోటు చేసుకోగా, ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల విద్యా ర్థులు రోజులాగే శుక్రవారం స్కూల్‌కు వెళ్లగా, చాలా మంది టీచర్లు హైదరాబాద్ సీఎం సభకు తరలివెళ్లారు. మధ్యాహ్నం వేళ భోజనం చేసేందుకు వెళ్లగా, ఉప్పూకారం లేని పప్పు వడ్డించడంతో తినేందుకు ఇష్టపడలేదు. ఆకలిగా ఉందని చెప్పడంతో కారం, నూనె ఇవ్వగా విద్యార్థులు దాంతోనే కడుపు నింపుకొన్నారు. ఈ విషయాన్ని పిల్లలు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు శనివారం బడికి వచ్చి మధ్యాహ్న భోజనాన్ని అడ్డుకుని ఎంఈవోకు నాగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థులు కారంతో భోజనం చేసిన విషయం వాస్తవమేనని, ఉన్నతాధికారులకు నివేదిస్తానని 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. మరోవైపు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు చెల్లించక పోవ డంతో భారీగా బకాయిలు పేరుకు పోయాయి. జిల్లాలో రూ.10 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉండడంతో నిర్వా హకులు అప్పు తెచ్చి భోజనాలు వడ్డిస్తున్నా రు. కష్టమైనా నష్టమైనా తప్పనిసరి పరిస్థితుల్లో పిల్లలకు వండి పెడుతున్నామని నిర్వాహకులు చెబుతున్నారు.

## సైబర్ మోసం నుంచి కాపాడిన సర్వర్ ప్రాబ్లం

- **కొడుకును అరెస్ట్ చేశామని సైబర్ నేరగాడి వీడియో కాల్**
- **తండ్రి ఫోన్ చేయడంతో సేఫ్‌గా ఉన్నానని కుమారుడి రిప్లై**
- **మోసం నుంచి తప్పించుకున్న మాచాపూర్ వాసి**

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 3: సైబర్ నేరగాడి మోసం నుంచి ఒకరు తృటిలో తప్పించుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని మాచాపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. బాధితుడు బల్లి వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశం ఫోన్‌కు శనివారం ఉదయం 9-39గంటలకు పోలీసు డ్రెస్‌లో ఉన్న అపరిచిత వ్యక్తి వీడియో కాల్ చేశాడు. 'నీ కుమారుడు సాయికుమార్‌ను బ్రోతల్ కేసులో అరెస్టు చేశాం. కోర్టుకు అప్పగిస్తే రూ.ఐదు లక్షల జరిమానా పడుతుంది. అలా కాకుండా ఉండాలంటే 70వేల పెనాల్టీ కట్టు ' అని హిందీలో చెప్పాడు. సాయికుమార్‌ను కొట్టినట్లు ఫేక్ రికార్డింగ్ వినిపించాడు. కొడుకును చూయించాలని వెంకటేశం ప్రాధేయపడగా.. డబ్బులు అకౌంట్‌లో వేస్తేనే విడిచిపెడతామని భయపెట్టాడు. వెంటనే డబ్బులు పంపించేందుకు ప్రయత్నించగా.. సర్వర్ ప్రాబ్లంతో డబ్బులు ట్రాన్స్‌ఫర్ కాలేదు. అంతలోనే వెంకటేశం.. తన కొడుకుకు ఫోన్ చేశాడు. తాను రూమ్‌లో పడుకున్నానని తెలిపాడు. దీంతో అది సైబర్ మోసం అని వెంకటేశం గ్రహించాడు. సైబర్ నేరగాడితో గట్టిగా మాట్లాడడంతో వీడియో కాల్ కట్ చేశారు.


బల్లి వెంకటేశంతో వీడియోకాల్ మాట్లాడుతున్న సైబర్ మోసగాడు

## రుణమాఫీలో చిత్రవిచిత్రాలెన్నో

# రూపాయి మాఫీ

- ప్రభుత్వ ప్రకటనలేమో గొప్పగా..
- అమలు తీరు అంతా తప్పుగా..
- ప్రహసనంగా మారిన రుణమాఫీ ప్రక్రియ

**రుణమాఫీ ప్రక్రియలో** చిత్ర విచిత్రాలెన్నో వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ప్రకటనలకు భిన్నంగా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు కనిపిస్తున్నాయి. రూ.లక్షన్నర లోపు పంట రుణాలన్నీ మాఫీ చేశామని కాంగ్రెస్ సర్కారు గొప్పగా ప్రకటించింది. కానీ, ఉమ్మడి జిల్లాలో బయట పడుతున్న ఉదంతాలు ప్రభుత్వ డొల్లతనాన్ని కళ్లకు కడుతున్నాయి. రూ.63 వేల రుణం తీసుకున్న ఓ రైతుకు ఒక్క రూపాయి మాత్రమే మాఫీ కావడం.. సర్కారు పనితీరుకు అద్దం పడుతున్నది. అంతేకాదు, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వేలాది మంది అర్హులైన రైతులకు మాఫీ వర్తించకుండా పోయింది. రూ.లక్షన్నర కాదు కదా, రూ.50 వేల లోపు ఉన్న ఎంతో మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. ప్రామాణికంగా అర్హుల జాబితాల రూపకల్పన చేయక పోవడం, మార్గదర్శకాల పేరిట కొర్రీలు విధించడంతో వేలాది మందికి ప్రభుత్వ ప్రయోజనం దక్కకుండా పోయింది. దీంతో ఆవేదనకు గురవుతున్న రైతులు అక్కడక్కడ ఆందోళనలకు దిగుతున్నారు.

–కోటగిరి, ఆగస్టు 3


ఎడపల్లిలో కెనరా బ్యాంకు మేనేజర్‌ను ప్రశ్నిస్తున్న రైతులు

### బ్యాంకు మేనేజర్‌పై రైతుల ఆగ్రహం

ఎడపల్లి, ఆగస్టు 3: ఎడపల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు మేనేజర్‌తో శనివారం పలువురు రైతులు వాగ్వాదానికి దిగారు. అన్ని అర్హతలు ఉన్నా రుణమాఫీ కాకపోవడంపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న ఏవో సిద్ధి రామేశ్వర్ బ్యాంకుకు చేరుకొని రైతులను సముదాయించారు. రైతులు ఆందోళన చెందొద్దని, రూ.లక్షా50వేల లోపు రుణమాఫీ కాని వారు ఆధార్ కార్డు నంబర్‌తో స్టేటస్ తెలుసుకోవాలని, నో డాటా వచ్చిన రైతులు బ్యాంకు నుంచి స్టేట్‌మెంట్ తీసుకోవాలని సూచించారు. రేషన్ కార్డు, రుణ గ్రహీత ఖాతా పేరు, ఆధార్‌లో పేరు వేర్వేరుగా వచ్చిన రైతులు పది రోజులు వేచి చూడాలని కోరారు. దీంతో రైతులు శాంతించారు.

### ఈ ప్రభుత్వంలో అన్నీ ఇబ్బందులే..



ధర్పల్లి, ఆగస్టు 3: మా గ్రామంలో కేవలం 8మంది రైతులకు మాత్రమే మాఫీ వచ్చింది. మిగతా వారికి రాలేదు. సమస్య ఏంటని బ్యాంకు వారిని అడిగితే పైనుంచి వస్తుంది మాకు ఎలాంటి సమాచారం లేదంటున్నారు. మేమంతా రూ.లక్ష, రూ.లక్షన్నరలోపు రుణాలున్న రైతులమే. ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాన్ని నిరసిస్తూ రైతులమంతా ధర్నా చేయాల్సి వస్తుంది. రుణమాఫీ అయ్యే వరకు బ్యాంకుకు మేము డబ్బులు కట్టబోం. మేము రుణమాఫీ చేయాలని సీఎంను అడగలేదు కదా.. ఆయనే చెప్పి అర్హులమైన మాకు మాఫీ ఎందుకు చేయడం లేదు. చేతనైతే రుణమాఫీ అందరికీ చేయాలి.

**- గుగులోత్ స్వామి, రైతు, మాజీ ఎంపీటీసీ, ధనంబండ తండా**

### రూపాయి మాఫీ అయిందట..



నా పేరు మీర్ రహీముతుల్లా అలీ. మాది కోటగిరి గ్రామం. నాకు ఎక్లాస్‌పూర్ శివారులో 1.9 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఐదేండ్ల కింద కోటగిరి సొసైటీల క్రాప్‌లోన్ తీసుకున్న. ఆ లోన్ మొత్తం కట్టేసిన. నిరుడు ఎస్‌బీఐలో రూ.63,400 క్రాప్‌లోన్ తీసుకున్న. నాకు ఒక్క రూపాయి మాఫీ అయినట్లు జాబితాలో పేరు వచ్చింది. రూపాయి మాఫీ అవుడెందో అర్థం కాలే.

**- మీర్ రహీముతుల్లా అలీ, రైతు, కోటగిరి**

### తిరిగీతిరిగి వేసారిపోతున్నాం..



ధర్పల్లి, ఆగస్టు 3: నాకు దుబ్బాక ఐవోబీలో రూ.83వేల వరకు రుణం ఉన్నది. మొదటి విడుతలో మాఫీ రావాల్సి ఉండగా రాలేదు. రెండో విడుతలోనైనా మాఫీ వస్తుందేమోనని ఆశగా ఎదురుచూశా. కానీ లిస్ట్‌లో నా పేరు రాలేదు. బ్యాంకు వద్దకు వెళ్లి ఆఫీసర్లను అడిగితే మాఫీ అయితేనే ఇస్తాం, రానిది మేం ఏం చేయాలని అంటున్నారు. గీసుంటి గవర్నమెంట్‌ను నేనెప్పుడూ చూడలేదు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయాలి. కానీ రైతులను మోసం చేయడం కరెక్ట్ కాదు. బ్యాంకుల చుట్టూ తిరిగీతిరిగి వేసారి పోతున్నాం.

**- భూక్య సంతోష్, మాజీ ఉపసర్పంచ్, రైతు, ధనంబండ తండా**

## ఆరు గ్యారెంటీల అమలు ఎప్పుడో?



బోధన్‌లో ధర్నా చేస్తున్న అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం బోధన్, ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ప్రతి పథకంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆరోపించారు. గ్యాస్‌కు సబ్సిడీ డబ్బులు రావడం లేదని, పింఛన్లు ఇంకా పెంచలేదన్నారు. క్వింటాలు వరికి రూ.500 బోనస్ విషయం విస్మరించారన్నారు. హామీలను వెంటనే అమలు చేయకపోతే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయంలో అందజేశారు. ఏఐపీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, రాష్ట్ర నాయకులు పుట్టి నడ్పి నాగన్న, పడాల శంకర్, పార్వతి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



మోర్తాడ్, ఆగస్టు 3: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి శనివారం 17,925 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా, శనివారం ప్రాజెక్ట్‌లో 1079.3 అడుగులు (43.091 టీఎంసీల) నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 703 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. సరస్వతీ కాలువకు 10, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 462 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ బడ్జెట్.. అరచేతిలో వైకుంఠం

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ**

వినాయక్‌నగర్, ఆగస్టు 3: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపెట్టిందని, యావత్ తెలంగాణ ప్రజల కండ్లలో కారం కొట్టిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ధ్వజమెత్తారు. బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యస్థాపన అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నయవంచనకు గురిచేసిందన్నారు. గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆడబిడ్డలపై లైంగికదాడులు, డ్రగ్స్‌కు అడ్డాగా రాష్ట్రం మారుతుందన్నారు. ఆరు గ్యారెంటీలు, ఐదు డిక్లరేషన్లు, 42 హామీలతో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. పెద్ద గాడిద గుడ్డు పెట్టిందని విమర్శించారు.